గణపయ్య పూజకు వేళాయె

- పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట
- వినాయక విగ్రహాల ఏర్పాటుకు సిద్ధమైన మండపాలు
- నేడు వినాయక చవితి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో వినాయక చవితి సందడి నెలకొంది. పూజా సామగ్రి కొనుగోలుకు విచ్చేసిన భక్తులతో పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. తోపుడు బండ్లపై విభిన్న రూపాల్లో ఉన్న రంగురంగుల వినాయక ప్రతిమల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. పుట్టపర్తిలోని చిత్రావతి రోడ్డు, సమాధి రోడ్డు, సాయిటవర్స్, గోవింద పేట, గోకులం, ఎనుములపల్లి, గణేష్ సర్కిల్, సాయినగర్ ప్రాంతాల్లో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మండపాలను సిద్ధం చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి ఉచితంగా 300 మట్టి వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి పంపిణీ చేశారు.




ధర్మవరం అర్బన్: వివిధ రకాల పూలు, టెంకాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు, బత్తలపల్లి: దుకాణం వద్ద చెరకు గడల కొనుగోళ్లు..

ధర్మవరం అర్బన్: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్ స్థానికులతో కిటకిటలాడింది. వినాయకుడికి ఇష్టమైన చెరకు, గరిక, పండ్లు, పూలు, టెంకాయలు తదితర సామగ్రి కొనుగోలు చేశారు. వినాయక ప్రతిమలను ప్రత్యేక ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో తరలించారు. తోరణాలు, వివిధ రకాల అలంకరణ సామగ్రిని విక్రయించేందుకు వ్యాపారులు పోటీపడ్డారు.

కదిరి టౌన్: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ఎక్కడ చూసిన సందడి నెలకొంది. వేమారెడ్డి సర్కిల్, దేవాలయం బజార్, ఇక్బాల్, కోనేరు, రాయలసీమ, ఇందిరాగాంధీ, అంబేడ్కర్ సర్కిల్ వద్ద అరటి గెలలు, మామిడి ఆకులు, ఎలక్కాయలు, గరిక కొనడానికి ప్రజలు పోటీపడ్డారు.

బత్తలపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బొజ్జ గణపయ్యలను కొలువుతీర్చేందుకు మండపాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మండపాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజా సామగ్రి కొనుగోళ్లతో బత్తలపల్లి కూడలి కిక్కిరిసిపోయింది.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కనగానపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు గ్రామాల్లో ప్రజలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు కనగానపల్లి, తగరకుంట, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో వినాయక మంటపాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటూ మంటపాలను అందంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే పట్టణాలు, నగరాల నుంచి వినాయక విగ్రహాలను గ్రామాలకు తీసుకొచ్చారు.



బత్తలపల్లి: గణపయ్య విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం




ప్రశాంతి నిలయం: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, ప్రతిమలను పరిశీలిస్తున్న ప్రజలు

క్లుప్తంగా

సీఎం జగన్ మేలు మరువలేం



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

నల్లమాడ: 1998 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు ఆదివారం నల్లసింగయ్యగారిపల్లిలోని స్వగృహంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చలువతో సుదీర్ఘ కాలం తర్వాత తాము ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులయ్యామని తెలిపారు. సీఎం జగన్ మేలు మరువలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

అర్బన్ సీఐకి సన్మానం



సీఐ కొండారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ పాలకమండలి సభ్యులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి అర్బన్ సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొండారెడ్డిని ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, కౌన్సిలర్లు సాయిగీత, సూర్యాగౌడ్, పవన్ కుమార్, పరుశురాం నాయక్, కో–ఆప్షన్ సభ్యుడు రఫీ, నాయకులు బ్రిక్స్ సాయి, కేశప్ప, కవిత, సందీప్ నాయుడు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడికి వెండి కిరీటం వితరణ



ఆలయ అధికారులకు వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

కదిరి టౌన్: పట్టణానికి చెందిన ఖాద్రీ ఆలయ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రేమనాథ్‌రెడ్డి ఆదివారం ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామికి రూ.25 వేలు విలువైన 300 గ్రాముల వెండి కిరీటం, కళ్లు బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారి చిత్రపటం, ప్రసాదాన్ని దాతలకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ఓబులేసు, పాలక మండలి సభ్యులు అశ్వర్థ నారాయణ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం



గుండె పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ధర్మవరం అర్బన్: ఉచిత గుండె వైద్య శిబిరంతో పేదలకు మేలు జరుగుతుందని అనంతపురం కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగమోహన్, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, దేవి నర్సింగ్ హోమ్ ఎండీ డాక్టర్ పద్మ, కాకతీయ పాఠశాల ఫౌండర్ రామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో ఆదివారం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు హిదయ్‌తుల్లా, రామకృష్ణ నాయక్, ఆంజనేయులు, రామాంజనేయులు, సంజయ్, మార్క్ ఆసుపత్రి డాక్టర్లు అమర్ మహేష్, నాగరాజు, మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో భారీ వర్షం



మడకశిర: వైఎస్సార్ సర్కిల్‌లో వర్షం పడుతున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 41.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ భార్గవి తెలిపారు. వర్షంతో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మడకశిరరూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. పంటలకు వర్షం ఎంతో అనుకూలమని రైతులు తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ధర్మవరం: నియోజకవర్గంలోని ప్రజలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లా స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులతో పీడీ మాధవరాజులు

కనగానపల్లి: ఏపీ స్కూల్ గేమ్స్ పోటీల్లో కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మాధవరాజులు తెలిపారు. ఆత్మకూరులో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు కబడీ, ఖోఖో, అథెలిటిక్స్‌లో ప్రతిభ కనబరిచారు. కబడ్డీ పోటీల్లో రాఘవ, హరి, అశోక్, వర్ధన్, రేవంత్, కార్తీక్, హర్ష, సాయి, మున్నీ, రేఖ, నర్మద, ఖోఖోలో యశ్వంత్ నాయక్, షటిల్ బాడ్మింటన్‌లో వరలక్ష్మి, పరుగు పందెం పోటీల్లో రేవంత్, అశోక్, షాట్‌పుట్‌లో నందకుమార్, లాంగ్‌జంప్‌లో రేవంత్‌లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతోపాటు పీడీని ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దొన్నికోట పంచాయతీలోని సుబ్బరాయునిపల్లి, గూడమేకలపల్లి, దొన్నికోట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నవరత్నాల్లోని పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువ పథకాలు వర్తించాయన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్, మీ బిడ్డ శ్రీధర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయా గ్రామాల్లో అపూర్వ స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేలుస్తూ దుశ్శాలువా, గజమాలలతో ఎమ్మెల్యేను సత్కరించి ఘన స్వాగతం పలికారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. కార్యక్రమంలో దొన్నికోట సర్పంచ్ రాగినేని సరస్వతి, పాల ఏకిరి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయమ్మ, వైస్ ఎంపీపీ ఉత్తమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌నాయుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, నాయకులు నాగరాజు నాయుడు, బాలాజీనాయుడు, కమలార్‌నాయుడు, గోపాల్‌నాయుడు, యూత్ విభాగం మండల ఉపాధ్యక్షులు అంజి, ఆసాది ఆదినారాయణ, గెంగినాయుడు, రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ లక్ష్మీనారాయణ, రామ్మోహన్, మహేంద్ర, బ్రహ్మయ్య, నరసింహులు, ఆలం సాబ్, నూరొద్దీన్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయితీ కేంద్రానికి చెందిన పలువురు ఆదివారం టీడీపీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో డీ.మహేంద్ర, అంజినప్ప, బసిరెడ్డిగారి సూర్యనారాయణ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతపురం ప్రీమియం లీగ్ ప్రారంభం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నాగలూరు వద్ద ఆర్డీటీ, అనంత క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంతపురం ప్రీమియం లీగ్ అండర్–15 క్రికెట్ మ్యాచ్‌లను ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసేపు బ్యాటింగ్ చేసి, అందరినీ అలరించారు. తొలిరోజు గొట్లూరుకు చెందిన ఏసీపీ (ఆదినారాయణ క్రికెట్ కోచింగ్ క్యాంప్), బుక్కరాయ సముద్రం జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బుక్కరాయ సముద్రం జట్టు 90 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏసీపీ జట్టు 8 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా సెక్రెటరీ మధు ఆచారి మాట్లాడుతూ.. ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చి భవిష్యత్‌కు బాటలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్లూరు మారుతి, కోచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులకు జ్ఞాపికలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: మండల పరిధిలోని పెడబల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎం.హరీష్‌రెడ్డి తెలిపారు. ముసల్‌రెడ్డి గారి రమేష్‌రెడ్డి (రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్) ప్రథమ వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ ఉషారాణి హాజరయ్యారు. డాక్టర్ ఉషారాణి రిబ్బన్ కట్ చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 400 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవల నిమిత్తం వచ్చిన వారికి నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు.

అనంతరం నిర్వాహకులు, వైద్యులను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, డాక్టర్ డి.మనోరంజన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ పి.ఫనిమహేష్ రెడ్డి, డాక్టర్ లీలాపద్మిని, డాక్టర్ భరత్ విష్ణురెడ్డి, ఎంపీపీ ఈటె రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సీనియర్ అడ్వకేట్ ఎం.నాగిరెడ్డి, ఎంపీటీసీలు సరస్వతి, కొత్తరంగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, యూత్ కన్వీనర్ వేణుగోపాల్ యాదవ్, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వేను పక్కాగా పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. శనివారం అనంతపురంలోని రంగస్వామి నగర్‌లో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ప్రతి ఇంట్లోని వారి ఆరోగ్య వాస్తవ పరిస్థితిని నమోదు చేయాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరాల్లో చికిత్సనలందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: వినాయక చవితి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో సీఐ కొండారెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎస్ఐ దాదాపీర్ సమక్షంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. వినాయక చవితి పండగను పురస్కరించుకుని గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఆయా గ్రామాల వినాయక కమిటీ సభ్యులు 5 మంది కలసి అనుమతి పొందిన అనంతరం విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చుట్టు పక్కల వారి నుంచి కూడా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మండపాల్లో ఇసుక, నీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైకులు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకూ వినియోగించాలన్నారు.

గాండ్లపెంట: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో వినాయక విగ్రహల ప్రతిష్ఠకు అనుమతి తీసుకోవాలని పోలీసులు తెలిపారు. అంతేకాక మండపాల వద్ద నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

తలుపుల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వినాయక చవితి పండుగ నిర్వహణపై అన్ని వర్గాల ప్రజలతో ఎస్ఐ మగ్బుల్‌బాషా సమావేశం నిర్వహించారు. ఈనెల 18న విగ్రహాలను ప్రతిష్ఠించి, 20వ తేదీన నిమజ్జనం చేయాలని సూచించారు. గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

బస్‌స్టేషన్ బాడుగకు టెండర్ల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్టీసీ డిపోకు సంబంధించిన బత్తలపల్లి బస్‌స్టేషన్ ఖాళీగా ఉన్నందున 15 సంవత్సరాల పాటు టెండర్ ద్వారా బాడుగకు ఇవ్వడానికి నిర్ణయించినట్లు డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బత్తలపల్లి బస్‌స్టేషన్‌ను ఏదైన ఆమోదయోగ్యమైన వ్యాపారాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు కడపలోని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలోని టెండర్ బాక్సులో టెండర్లు వేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9959225859, 7382860947, 7382861410, 7382860501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పరామర్శ



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్య బాధితులను ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పరామర్శించారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద కోలుకొంటున్న ట్రాన్స్‌కో ఉద్యోగి టీడీ రఘునాథరెడ్డి, క్యాన్సర్‌తో బాధపడుతున్న తలమర్ల సరస్వతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఇటీవల కదిరి మండలం యర్రదొడ్డి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షేమంగా బయటపడిన రాజారెడ్డి కుమారుడు చిన్నారి నిషాంత్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనంతవాసికి జాతీయ అవార్డు గర్వకారణం



నాగేశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: జిల్లా వాసి అయిన బోడిగొల్ల నాగేశ్వరయ్యకు ప్రతిష్టాత్మక జాతీయస్థాయి అవార్డు దక్కడం గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో ఇంటర్నేషనల్ సంకల్ప్–2023 అవార్డును బోడిగొల్ల నాగేశ్వరయ్య అందుకున్నారు. ఈసందర్భంగా నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంత వాసికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. అనంతరం నాగేశ్వరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డీడీపీ ప్రభుదాస్, ఆర్ఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, నార్పల బాలుర వసతి గృహ పూర్వ విద్యార్థులు శివయ్య, టీచర్ సంజప్ప, గడ్డం నాగేపల్లి పెద్దన్న, ఎంసీ పెద్దయ్య, లక్ష్మణ్, ఎల్లుట్ల లక్ష్మయ్య స్వామి, బంగి సుదర్శన్, పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.